# అరిటిచెట్టు

"ఆ కుక్కర్ సంగతి నే చూస్తాలే. ఇవాళ నువు డాక్టర్ని చూసి రావాలి. వంశాంకురం వద్దా? డబ్బుండగానే సరా? చదువబ్బగానే సరా?" అత్తగారు సూరమ్మ దీర్ఘం తీస్తు మంద్ర స్వరంలో అన్నా, అనితకి సాదిస్తున్నట్టే వున్నది.

అనిత బొద్దుగా వుంటుంది, వుద్యోగమూ చేస్తున్నది.

"మీకు నడుం నెప్పి పట్టిందీ, మోకాలులో కలక, కంటి అద్దాలు మార్చాలంటిరి. డాక్టరేమో అవే అద్దాలు యింకా కొన్నాళ్ళు వాడచ్చు అసెను. శుక్లాలేర్పడుతున్నా యేమో నంటుంటిరి. అందుకని వంటచేసి పోదామని చూస్తున్నాను."

నీ వంట తగలెయ్యా! కడుప్పండలేదనే చింతే లేదు నీకు. మగరాయుడల్లే ఆ వుద్యోగమొకటి, కొడుకు సరే సరి. 'నాకు సిగ్గు, నేను డాక్టరు దగ్గరకి పోను. నువే పో.' అంటాడు. 'అరవై యేళ్ళు వచ్చి చదువుకోక నోట మట్టి కొట్టుకోనా?' అన్నాడుట. చచ్చే పొద్దొచ్చి బిడ్డల్ని కనేదా? నూవ్వా వినక వాడూ వినక యెన్నాళ్ళు వుడకేస్తు కూచోనూ. 'సంతు లేనీ యిల్లు జంగాల మఠము' అని వాడేమో బైరాగిలాగా కాషాయ లుంగీ కట్టి, చొక్కా తీసేసి కనిపిస్తాడు. నువేమో డబ్బాలాగా వుండే పెద్ద గౌను తొడిగి, నెత్తిమీద ముడిపెట్టి, బోసిచేతులూ, బోసిమెడతో కంటి యెదుట తిరుగుతావు. నా వల్లగాదూ, నే పోతున్నా అలా అంటూ వీధివేపు వెళ్ళిందత్తగారు.

అనిత పరుగెత్తుకెళ్ళి చెయ్యి పట్టుకున్నది.

యెక్కడి కెళ్తున్నారూ? అన్నది యేడుపు మొహం పెట్టింది, మొహాన చమట బిందువులూ.

యేట్లోకి పెద్దకిష్ట మధ్యకి, వదులు నన్ను విదిలించింది అత్తగారు.

వెళ్ళకండి, మీ తమ్ముడి మనమడిని తెచ్చి పెంచుతూ ముద్దు చేసుకోండి. వాళ్ళకి చాలామంది పిల్లలు గలిగారు.

నువ్వు పెంచుకో నీ మేనల్లుడి మనమడిని, నన్ను పోనీ.

వద్దు, వెళ్ళద్దు, ఇవాళ సెలవు పెట్టి, డాక్టర్ని కన్సల్టు చేయటానికి వెళ్తాను. మీ అబ్బాయి మీరు లేనిదీ వుండలేరు, రండి అని లాగింది.

సిగ్గు లేదూ, మీరిద్దరూ చిన్న పిల్లలా? మీ పాల బుగ్గలు ముద్దులాడాలా? అన్నది అత్తగారు.

సిగ్గుండే యిన్నాళ్ళూ డాక్టర్ని చూడలేదు. ఇవాళ విడిచేశా, రండి లోపలికి, చూశారా అప్పుడే అరుసార్లు కూసింది కుక్కరు, అది గూడా నన్ను కసురుతున్నది.

అత్తగారు అన్నీ అందిస్తే అనిత త్వరగా వంట పూర్తి చేసింది. డ్రెస్ చేసుకుని, పర్సు అందుకుని చేతి సంచీలో వుంచి అత్తగారికోసం చూసింది. ఆమె దీపారాధన చేస్తున్నది. వంగి పాదాలు తాకి నెత్తిన రాచుకుని బయలుదేరింది. మొగుడు స్కూటర్ మీద యెప్పుడో పుడాయించాడు. మంచి కొత్త ఆటో వచ్చి యెదురుగా నిలబడింది, అనిత యెక్కింది.

ముందు ఆఫీస్‌కెళ్ళింది, తీసే వున్నాయి తలుపులు, శలవు చీటీ రాస్తుండగా క్లర్క్ విజయ వచ్చింది. చీటీ చూసింది.

"ఇవాళ సెలవే మేడమ్" అన్నది నవ్వుతూ.

అనిత శలవు చీటీ చింపేసి బుట్టలో పడేసింది.

"అలా వున్నారేం? యేదో బాధ. నేనేమైనా చేయ గలనా?"

"గైనకాలజిస్ట్ ఇందిరాబాయిని చూడాలి" అన్నది.

"నేను గూడా రానా?" విజయ వుత్సాహంగా కని పించింది.

"నువ్వు గూడా కన్సల్ట్ చేయాలా?" తలెత్తి అడిగింది.

"పిల్లలకోసమా మేడమ్! నాకా యిబ్బంది లేదు, అప్పుడే అరడజన్‌మంది కోతిపిల్లలు యింట్లో. మళ్ళా నెల తప్పింది." తల వెనక్కు వాల్చి, బల్లకి చేతులాన్చి నవ్వింది విజయ.

యెవరు చూస్తారు వాళ్ళని.

యెవరూ చూడక్కర్లేదు మేడమ్, ఇద్దర్ని నర్సరీలో దిగ విడుస్తా. ఇద్దర్ని పిల్లల్ని చూసే ప్రైవేట్ సంస్థలో దించి వస్తా. ఇద్దర్ని పక్కింటి మామ్మగారి కేర్లో వుంచి వస్తా. మామ్మగారికి భోజనం, వస్త్రం నేనే సమకూరుస్తా. విజయ నవ్వుతూనే చెపుతున్నది గానీ, బాధ కనబడుతూనే వున్నది. యెటో చూస్తుంది. తప్పించుకోలేనన్నట్టు చూస్తుంది.

ఇద్దరిద్దరు కలిగారా?

లేదు మేడమ్, చిన్నప్పుడే పెళ్ళి చేశారు, పద్దెనిమిదేళ్ళ పెళ్ళినాటికి, యెడం లేకుండా తొమ్మిదేళ్ళలో ఆరుగురు కలిగారు.

చిత్రమే, జాబ్ మానేసి నువే చూసుకోవూ పిల్లల్ని?

యెలా? మొగుడుగా రేపో కట్నం, కనికా అక్కర్లేదు. వుద్యోగం వెలిగించాలి అనే షరతు మీద పెళ్ళి స్థిరపరిచాడు. బికామ్ మొక్కుబడి తీరంగానే, వుద్యోగం తెచ్చిచ్చాడు.

అంతమంధ్గిని కనరాదే, జాగ్రత్తలు తీసుకోలేదూ?

అన్ని భద్రతలూ ఫెయిలై నై మేడమ్, ఇహ భర్తగారే బర్త్ కంట్రోల్ ఆపరేషన్ చేయించుకోవాలని ఆలోచిస్తున్నారు. సిగ్గూ, భయమూనట. తలొంచుకు నవ్వింది విజయ.

అతివృష్టి, అనావృష్టిలాగా వున్నాం యిద్దరం, కోడాం రా.

### 3

ఫస్ట్ స్టెప్ లావు తీయాలన్నది డాక్టరమ్మ అని, అనిత డయట్ అబ్జర్వ్ చేసింది.

మరీ అంత తక్కువ తినాలా అన్నా! జబ్బు చేయదూ? కలవూ పెట్టలేదు అనడిగింది అత్తగారు.

మరెట్లా? అంకురమంటిరే, అప్పుడే అయిపోయిందీ? యేదో చిన్న శస్త్రచికిత్స చేయాలన్నది డాక్టరు మీరు భయపడతారని చెప్పలేదు అన్నది అనిత.

శస్త్రచికిత్సే! యెన్నాళ్ళుండాలి నర్సింగ్ హోమ్‌లో?

"ఆశ్చర్యపోతారేం? ప్రదక్షిణలు చేయమంటిరి. చేస్తిని.

అత్తగారు నోటిమీద చెయ్యేసుకుని కింద చతికిలబడింది. మరీ తక్కువ తింటున్న కోడల్నె చూడలేకపోతున్నది.

"మీరు త్రికరణ శుద్ధిగా మొక్కుకుంటిరి. మీ అబ్బాయిని శబర్మలై వెళ్ళమంటిరి, బుద్ధిమంతునిలాగా నల్లగుడ్డలూ, తావళాలూ, బొట్టూ, గడ్డం మీసం నలభై రోజులూ బొట్టూ పాటించారు. చేయను అన్నారా? నేనందుకే, నాకు విడాకులిచ్చి, వేరే చిన్నపిల్లను పెళ్ళి చేసుకోనీయండి అంటే మీకిద్దరికీ తప్పుగా తోచింది" అనిత పళ్ళెం పట్టుకు లేచింది.

చేయి తుడుచుకుంటూ వచ్చి అత్తగారిని లేవదీసింది.

కింద కటికనేలమీద పడుకుంటే నడుం పట్టుకు పోతుంది. మంచంమీద పడుకోవాలి, నర్సింగ్ హోమ్‌లో వుండేది ఒక్క పూటేనన్నది డాక్టరమ్మ. ఇంటికి వచ్చేస్తా, భయం లేదు.

సూరమ్మత్త దిగులు పడిపోయి చిక్కిపోయింది. నిక్షేపమంటి కోడలికి విడాకులివ్వాలా? అటువంటి పని చేయాల్సి వస్తుందా? దేవుడు లేడా? తన మొరాలకించడా, తపించిపోయింది.

దైవం పలికాడు. అనితకు వేవిళ్ళ జ్వరం, వాంతులూ. ఇంకా చిక్కిపోయింది, శలవు పెట్టలేదు.

"ఇప్పుడు మామూలుగా తినచ్చేమో అన్నూ" అన్నది అత్తగారు. టొమేటో చారు, పుల్లగా పెట్టింది, నిమ్మకాయా.

"బిడ్డ మరీ పెరగరాదన్నది డాక్టరు, నేను తూకం మరీ పెరగరాదుట, తూకం చూసుకుంటూ వుండు అన్నది."

అత్తగారికి చేతులూరుకోక, కోడలు చారూ అన్నం తింటుంటే చూడలేక, పూతప్పం, వెన్నప్పాలూ, పేణీలు, పొజ్జ పూరీలూ చేసి తినిపించింది. రకరకాల జంతికలు, చేగోడీలూ చేసింది. అనితకి జాలేసి సాయపడింది.

యెక్కడో వున్న వియ్యపురాలిని, ఆమె పెద్దదే, భోపాల్ నించి పిలిపించింది సూరమ్మత్త, అయిదో నెలలో అత్తవారూ, యేడో నెలలో పుట్టింటివారూ సూడిదలివ్వాలని రివాజు.

సూరమ్మొదినా కూతుర్ని తీసికెళ్ళా అనిత తల్లి అన్నది.

వద్దు, ఇక్కడే పోసుకుంటుంది అన్నూ. మొదట్నించీ చూస్తున్న డాక్టరమ్మే చూడాలి, పంపను అన్నది సూరమ్మ.

నాకు వుండేందుకు వీలులేదు. ఇల్లు కొల్లేరు చేస్తుంది కోడలు, గంపెడు పిల్లలూ, వచ్చే పోయేవారూ.

టిక్కెట్టు తెస్తాడబ్బాయి, వెళ్ళువుగాని.

చదువుకున్నవాళ్ళూ, చదువుకోని పాతకాలపు ముత్తయిదువులూ నోళ్ళు నొక్కుకోటం చూసింది తల్లి.

ప్రెగ్నెన్సీ కాదేమో, సిస్టేమో. యేజ్ బార్రైపోలా?

ఈ కానుపు తిన్నగా అవుతుందీ. మరీ ఆలస్యంగా లేదూ? పనిలోకి వెళ్తూనేవున్నది అనిత, మాన్పించలేదూ సూరమ్మత్త?

అవ్వా కావాలి, బువ్వా కావాలి దానికి పెద్ద జీతం గదూ?

## 3

సిజరియన్ ఆపరేషన్ జరిగింది. మూడునెలలు విశ్రాంతి తీసుకోవాలన్నారు డాక్టర్లు. లేచి తిరగగలిగిన అనిత అత్తగారి సంతోషం చూసింది. చింకిచాటంత ముఖంతో ముద్దుల మనమడితో ఆడుకుంటుంది నానమ్మ. అన్నీ తానే చేస్తుంది. కోడలి చేత పచ్చమూ చేయించింది. వుద్యోగంలోకి వెళ్ళాలని గుర్తు చేసింది అనిత.

అదేదో శలవుందిగా, మెటర్నిటీ లీవ్ గాబోలు. అప్పుడే అయిపోయిందీ. బోర్లపడుతున్న మనమడిని చూస్తున్నది.

అయిపోయింది, పాలు వదిలాడుగా అన్నది కోడలు.

జుట్టంతా వూడిపోతున్నది అనిత బాధగా అన్నది.

"ఊకెళ్ళకూడి మాటలకు మళ్ళా వస్తుంది" అత్త వోదార్చింది.

"ఊఁ" అంటున్నాడని పంచదారతో వుగ్గు గిన్నెలు చేసి పంచింది నానమ్మ. పలుకులకి చిలకలు, అడుగులకి అరిశలు చేసింది. వరసన పేర్చి మనమడిచేత దాటించి, ఆ అరిశలు చాకలి రామికిచ్చింది.

అత్తగారికి నడుం నెప్పీ, కాళ్ళవాపూ యిబ్బందులు తెచ్చిపెటినై. అనితకి ఆ ర్త్రైటిస్ వచ్చింది. మొగుడు చందూ, తన పేరా, భార్య పేరా అప్పుతెచ్చి కొత్త కారు కొనితెచ్చాడు. అనితను దాంట్లో కూచోబెట్టి తానే డ్రైవ్ చేసి బాంక్‌లో ఆమె సీటులో కూచోబెట్టి వస్తాడు. సాయంత్రం వెళ్ళి తానే తెస్తాడు

పాపం సూరమ్మత్త యింకేమీ ఆశించలేదు. కానీ దేముడు మళ్ళా కరుణించాడు. లోపల సంతోషించినా, పైకి అదుర్దాయే వెల్లడించింది అత్తగారు. కొడుకు మరో బాధ కలిగించాడు. ఒక వంటవాడిని యేర్పాటు చేశాడు. సూరమ్మత్త వాడి అనాచారం భరించలేకపోతున్నది. మనుమడితోనూ వేగలేకపోతున్నది. వాకిట్లోకి పరుగు తీస్తాడు, వాడి వెంట బడుతుంది, వాడు అందడు.

వియ్యపురాలికి పక్షవాతమొచ్చి మంచంలో వున్నదిట. రాలేనని వుత్తరం పడేయించింది. ఇబ్బందిలో యిరుక్కున్నది సూరమ్మత్త. యేం చేస్తుంది? తానే కోరి తెచ్చుకున్న దీ అవస్థలు. ఈ అవస్థల్లో యేదో సుఖమున్నదని దేవుని అడిగి తెచ్చుకున్నది. అన్నీ కొట్టేస్తున్నాడని వంటవాడిని తరిమేసింది. ఇంకా అవస్థలెక్కువైనై.

మళ్ళా శస్త్రచికిత్స జరిగింది. ముద్దులు మూటగట్టే మనమరాల్నిచ్చింది కోడలు. మనమడి చెయ్యి పట్టుకుని, నర్సింగ్ హోమ్‌లో స్పెషల్ రూమ్‌నో నిలబడింది అత్తగారు. ఉయ్యాల్లో పాప కళ్ళు విప్పి మామ్మను చూసింది.

"ఇంటికి వచ్చేస్తానత్తగారూ. నా చుట్టూ మీరు తిరగలేరు" అన్నది అనిత.

"వద్దు, లేచి తిరుగుతావు, యెలాగో తంటాలు పడతాలే, కారున్నదిగా" అన్నదత్తగారు.

"మరోసారి కాన్పుకి తయారు కారాదు మీ కోడలు. మీ అబ్బాయి కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స చేయించుకోవాలి, మీరు వత్తిడి చేవాలి" అన్నది ఖానూ డేవిడ్.

వినడమ్మా వినడు, భయమూ సిగ్గూ అంటాడు. ఇహ దైవాన్ని వేడుకోవాలి అన్నదత్తగారు.

గునగునా నడిచే ముద్దయిన మనుమరాలు, యింట్లో సందడి చేస్తున్నా. పడిపోతున్న కోడల్ని చూసి భయ పడింది సూరమ్మ. రక్తలేమి వచ్చిందన్నాడు డాక్టరు, బి. పి. పడిపోతే ఆయాసపడుతుంది అనిత. మందులు కాపాడు తున్నాయి.

పుట్టు వెంట్రుకలు తీయించే పండగా, అక్షరాభ్యాసం చెయించింది మనమడికి. ఘనంగా ఒడుగు చేయించింది.

ఆఫీసునించి యింటికి తెచ్చి, మెత్తగున్న కుర్చీలో వుంచుతాడు భర్త. కూతుడు పరుగెత్తుకొచ్చి మీద బడితే వూరికే చూస్తుంది అనిత.

"మీద బడరాదు, అమ్మకు బలం లేదు, పోయి ఆడుకో" అంటాడు తండ్రి. కూతురు బిక్కమొహంతో వెళ్ళిపోతుంది.

మనుమరాలు బొమ్మ సామానుతో ఆడుతుంటే చూసి ఆనందిస్తుంది సూరమ్మ. నగలు పెట్టి వినోదిస్తుంది, పావడా జుబ్బా పట్టువే కడుతుంది మనుమరాలికి, వెండి తామరాకు పళ్ళెంలో అన్నం కలిపి తినిపిస్తుంది.

చందు అందమైన ఫ్లాట్ కొని ఫామిలీని అందులోకి మార్చాడు. మూడు పడగ్గదులున్న ఫ్లాట్, అనితకి రెగ్యులర్ చెకప్ చేయిస్తాడు. దగ్గర కూచుని తలరాస్తూ అడిగాడు.

"అన్నా! కాష్మీర్ చూసి వద్దామా, నా భీమా డబ్బు మీద వడ్డీ వస్తుంది, అది వాడుకోవచ్చు."

"సారీ, నేను రాలేను, మీరూ అత్తయ్యా, పిల్లలూ వెళ్ళి చూసిరండి, నాతో అవస్థ, ఈ వీల్ ఛెయిరూ నేనూ, యేమీ తినలేను" అన్నది విచారంగా.

ఎంట్రెన్సు వ్రాసి మెడిసిన్‌లో సీటు తెచ్చుకున్నాడు మనుమడు. సూరమ్మ కాష్మీర్ వద్దని, మనుమడూ మనుమరాలితో తిరుపతి వెళ్ళి దైవదర్శనం చేయించి వచ్చింది.

"అన్నా! మంచి సంబంధాలు మా వాళ్ళవేపు నించి వస్తున్నాయి, నిశ్చయించాలనుకుంటున్నాను" అన్నది అత్తగారు.

వారపత్రిక చదువుతూ, పక్కమీదున్న అనిత పేలవంగా బలహీనంగా నవ్వింది.

అప్పుడే యే పెళ్ళి అత్తగారూ! పెళ్ళి అయింది మొదలు కొని పిల్లల్ని కనాలి. కనకపోతే అనేక యిబ్బందులు కల్పించు కుంటారు. సునీతకు పద్దెనిమిదేళ్ళు రావద్దా, సుధాకర్ మెడిసిన్ పూర్తి చేయాలి, పోస్ట్ గ్రాడ్యుయేట్ చేయాలి, స్పెషలైజ్ చేయాలి అన్నది.

అవన్నీ అయేదాకా నేనుంటానో వుండనో, పెళ్ళిళ్ళు చూసిపోతా, అవన్నీ పూర్తయేప్పటికి సుధాకర్‌కి ముప్పై యేళ్ళు వస్తాయి, అప్పుడు నా మాట వినడు. సునీత అప్పుడే మగపిల్లలతో తిరుగుతున్నది, తనిష్టమొచ్చినవాడినే చేసు

కుంటానంటుంది, నేను యెన్నిక చేసినవాడు నచ్చలేదంటుంది. పెళ్ళిళ్ళు చేసే స్తే మనుషులు సాయముంటారు, పోనీ నిశ్చయం చేసుకోనీ, సంధి బేరంలాగా వున్నదామాట.

తన పిల్లలు రాట్ రేసులో పాల్గొనబోతున్నారని మనసులోనే నవ్వుకున్నది అనిత. ఈ అత్తగారికి యీ ఆరాటమేమిటో. విశ్రాంతి అనుభవించలేదా? పనివాళ్ళమీద ఆధారపడాల్సి వస్తున్నది, అలా ఆలోచిస్తుండగా అత్తగారి మనస్తత్వం, అద్దంలో చూసినట్లు అర్థమైంది. ఇంట్లో తన మాట నెగ్గేట్లు చూసుకుంటుంది, బాగా అధికారం కావాలి, పదవి వదులుకోనట్టే అధికారమూ వదలదు, పెద్దరికమూ నిలుపుకుంటుంది. ఊరికెనే భగవద్ధ్యానం చేస్తుందిగానీ, అంతా తన చేతులో వుండాలనేదే కోరిక, తనే చేస్తున్నాననే తృప్తి కావాలి, ఆవిడ నాపిచ్చిలోనే వుండనిస్తాడు కొడుకు. ప్రపంచమంతా చూసివచ్చినట్టు, విశ్వ రూప సందర్శనమైనట్టు నవ్వుకున్నది అనిత. తనకు మణికట్లు గూడా జబ్బుపడి పనికిరాకుండా పోతున్నాయి. అరుగుదల తగ్గిపోతున్నది, మనిషి సాయం లేనిదీ ఒక్క పని చేసుకోలేక పోతున్నది, ఆ వుద్యోగం వదల్లేదు, సెలవు పెట్టనూ, పనిలో చేరనూ అదొక రొటీన్.

4

"అమ్మా! యెలా వున్నదీ?" భర్త తలమీద రాస్తూ చెయి పట్టుకు అడుగుతున్నాడు. బెడ్ పక్కన కుర్చీలో వున్నాడు. అనిత కళ్ళు విప్పింది, జాలిగా చూసింది. ఇంకా స్వాధీనంలో వున్న కుడిచేతితో భర్త తల నిమిరింది.

వాళ్ళిద్దరూ యింకా రిటైర్ కాలేదు.

అనితకు మళ్ళా ప్రెగ్నెన్సీ వచ్చింది. అంతా ఆశ్చర్య పోయారు. బంధువులు, కొలీగ్స్, స్నేహితురాళ్ళు ఆదుర్దా వెల్లడించారు.

"చిత్రంగా వున్నదే, లేట్ కాలేదూ. అనితకు కనీసం నలభై యెనిమిదేళ్ళయినా వుండి వుండాలి. కూతురు పుట్టి నప్పుడే మూడవసారి ప్రమాదం అని డాక్టరమ్మ వార్నింగిచ్చింది" అన్నదో స్నేహితురాలు.

"ఆడదీ అరిటిచెట్టూ అన్నారందుకే. ఈ పిల్లల్ని కనటంతోనే ముగుస్తుంది జీవితం. అనిత అసలే రక్తలేమివల్ల బాధ పడుతున్నది. ఈ డెలివరీతో ఆ వున్న కాస్తా రక్తం పోతున్నది. స్రావం కట్టటం లేదుట. బి. పి. కంట్రోల్ కావటం లేదుట. పడిపోతున్నదిట."

"అత్తగారు తన కోరికలు నెరవేరేట్టు చూసుకున్నది. పెళ్ళిళ్ళు కానిచ్చేసింది. అనూ కోడలూ అల్లుడూ రావాలే. ఫోన్ చేశారా?"

"చేశారు, చేశారు. ఆ యిద్దరు వియ్యాలవారూ గాక సహ వుద్యోగినులూ, ఆఫీస్ స్టాఫ్‌తో హాస్పటల్ నిండిపోతున్నది.

"ఒక్క నిందపడి యెరగదు. ఒక్క కేసు నెత్తినెక్కలేదు. ఎలా నెగ్గుకొచ్చిందో!"

"అత్తగారు వచ్చిందా? లేవటం లేదన్నారే?"

లేవకేం, లేస్తున్నది. ఘడకర్రిలాగా నిలబడగలదు. మొదటినించీ ఆమెదే అధికారమంతా. మొత్తానికి పట్టుదల నెగ్గించుకున్నది. పిల్లల్ని కనిపించింది. వాళ్ళను తానే పెంచింది.

"అనితది మెత్తని మనసు, ప్రేమైక జీవి. యెవరినీ నొప్పించటం యిష్టం లేదు. 'అరిటాకు పోయి ముల్లు మీద పడ్డా, ముల్లు వచ్చి అరిటాకు మీద పడ్డా అరిటాకుకే నష్టం' అనేది. అంటే నాకు అర్థమయేది గాదు."

"అంత వయసున్నట్టు కనబడేది గాదు. నిండుకుండ, ముద్దబంతిలాగా కనిపించేది, జుట్టుకు రంగేస్తుందేమో ననుకునే దాన్ని, లేదు, అది సహజమైన నలుపే జుట్టుకి."

"ఈ కాన్పులు మొదలెట్టాకే జబ్బుపడటం మొదలైంది."

ఇవాళెన్నో రోజూ?

ఆరో రోజు.

అదుగో అత్తగారు కారులో వచ్చింది, మనం గూడా పైకి పోదాం రండి, లిఫ్టు ఖాళీగా వుండదు మళ్ళా.

కోడలి బెడ్ పక్కగా వున్న యినప వూయాలలో పక్క మీదున్న మనుమడిని చూసింది సూరమ్మ అత్తగారు. తనకి

రెండవసారి బాల్యం వచ్చింది, మళ్ళా పొద్దు పుచ్చేందుకు కంపానియన్ వచ్చాడు.

వీడికి అయిదో యేడు వచ్చే వరకు వీడితో ఆడుకోవచ్చు అనుకుంటూ నవ్వుకున్నది అత్తగారు.

పక్క దగ్గర నిలబడింది, కాంతి తరగని కోడలి ముఖం చూసింది, నిద్ర పట్టిందని తలిచింది.

అనూ! అని పిలిచింది, మీద చెయ్యి వేసింది.

కాని అనూ కళ్ళు విప్పలేదు.

— ० —